# మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

- కల్లూరు మండలంలో 8,621 మందికి వైఎస్సార్ ఆసరా సాయం
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని
- లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం


పొదుపు మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏపీఎం శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో కల్లూరు మండలం పొదుపు సంఘాల ఆసరా వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిళలకు మెగా చెక్కును అందజేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ పొదుపు సంఘాల మహిళలకు పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న బ్యాంక్ లింకేజీ అప్పు మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో చెల్లించారన్నారు.

**8,621 మంది సభ్యులకు లబ్ధి**

ఆసరా పథకం కింద మండలంలో మొత్తం 831 పొదుపు సంఘాలు ఉంటే అందుల్లో 8,621 మంది సభ్యులకు లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే తెలిపారు. నాల్గవ విడత కింద రూ.4.94 కోట్లు రుణాలు మాఫీ చేశామన్నారు. నాలుగు విడతలు కలిపి మొత్తం రూ. 19.76 కోట్లు మాఫీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే జమచేశామన్నారు. ప్రభుత్వ సాయంతో ఆర్థికంగా ఎదిగి, జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేసిన మేలును మరువకూడదన్నారు.

**నాడు మోసం చేసిన టీడీపీ సర్కారు**

2014 ఎన్నికల్లో పొదుపు సంఘాల రుణాలను మాఫీ చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చి.. అధికారంలోకి రాగానే పట్టించుకోలేదని ఎమ్మెల్యే కాటసాని పేర్కొన్నారు. నమ్మి రుణాలు చెల్లించని పొదుపు సంఘాలు ఆ తర్వాత తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయన్నారు. టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను గమనించాలని కోరారు. రాష్ట్రంలో అక్కాచెల్లెమ్మలపై సీఎం జగన్ అపారనమ్మకం ఉంచారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. అంతకు ముందు ఎంపీపీ బోయశారద, పొదుపు మహిళలతో కలిసి ఎమ్మెల్యే కాటసాని సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణమూర్తి, తహసీల్దార్ మునివేలు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెద్ద ఈశ్వరయ్య, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పొదుపు సంఘాల సీసీలు, సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

# నగరాభివృద్ధికి పెద్దపీట

- అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం
- మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- 46వ వార్డులో రూ.2.18 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

కర్నూలు (టౌన్): నగర అభివృద్ధికి పెద్ద పీట వేసినట్లు కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. స్థానిక 46 వ వార్డులోని అశోక్ నగర్, పాలకొట్టాలు తదితర కాలనీల్లో రూ. 2.18 కోట్లతో చేపట్టిన సీసీ కాల్వల పనులు పూర్తయ్యాయి. వాటిని సోమవారం మేయర్, ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కర్నూలు నగరంలో పెద్ద ఎత్తున్న అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నగరాభివృద్ధి జరగలేదన్నారు. కనీసం కర్నూలు కార్పొరేషన్‌కు ఎన్నికలు సైతం నిర్వహించలేని దుస్థితిలో నాటి ప్రభుత్వం ఉండేదన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చిన తమ పార్టీ ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన 56 నెలల్లోనే కర్నూలు నగర రూపురేఖలు మార్చామని, అన్ని వార్డులను పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలతో అందంగా తీర్చిదిద్దామన్నారు. తమపై విమర్శలు చేసే టీడీపీ నాయకులు అధికారంలో ఉన్న ఐదేళ్లల్లో ఒక్క మంచి పనైనా చేశారా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, కార్పొరేటర్ శ్రీనివాసరావు, వార్డు నాయకులు అంజనేయులు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే**

ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తన నివాసంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు పలువురు ఆయనను కలిసి సమస్యలు విన్నవించారు. వెనువెంటనే ఆయన స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## క్లుప్తంగా

### ఆర్‌యూ అభివృద్ధికి సహకరించాలని వినతి


మంత్రి అంజాద్‌బాషాకు బొకే అందిస్తున్న ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్ కుమార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి అంజాద్‌బాషాను వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ కోరారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం వైఎస్సార్ కడపలో డిప్యూటీ సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం పురోగతికి అవసరమైన నిధుల మంజూరు విషయాన్ని ప్రస్తావించగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వీసీ తెలిపారు.

### 14న దామోదరం సంజీవయ్య జయంతి

కర్నూలు (అర్బన్) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 14న దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక నంద్యాల చెక్‌పోస్టు పరిధిలో ఉన్న ఆయన విగ్రహానికి ఉదయం 10:30 గంటలకు పూలమాలలు వేసి ఉత్సవాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, పెద్ద సంఖ్యలో దళిత, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

### ఆర్‌ఎంఎస్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ

కర్నూలు: కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు ఎంపికైన ముగ్గురు విద్యార్థులను ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం అభినందించారు. కర్నూలు జిల్లా నుంచి 6వ తరగతికి వెంకట సాయిచరణ్, సోమశేఖర్, 9వ తరగతికి పూజారి చరణ్ రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు ఎంపికయ్యారు. కర్నూలు ఎస్‌హెచ్ఎస్ సైనిక్ స్కూల్ కోచింగ్ సెంటర్ వారు ఆ విద్యార్థులకు కోచింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ హరితో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఎస్పీ స్పందన కార్యాలయానికి పిలిపించి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అభినందించారు.

### టెలికాంలో ఉపాధి అవకాశాలపై అవగాహన


మాట్లాడుతున్న విశ్రాంత అధికారి నోముల ప్రసాద్

కర్నూలు కల్చరల్: నగర శివారులోని రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం టెలికాం రంగం, యువత ఉపాధి అవకాశాలు అనే అంశంపై సదస్సు జరిగింది. వికసిత భారత్ 2047లో భాగంగా జరిగిన సదస్సులో టెలికాం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ రిటైర్డ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఫ్లైట్ లెఫ్టినెంట్ నోముల ప్రసాద్ ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న సాంకేతిక విద్య దేశ అభివృద్ధికి బాటలు వేయనుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషశ్రీ, ఇన్నోవేషన్ కౌన్సిల్ కో-ఆర్డినేటర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

### వినతుల పరిష్కారానికి చర్యలు


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): స్పందన వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలువురు కమిషనర్‌ను కలిసి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, ఏసీపీ శశికళ, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

# రైతన్నల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని, హఫీజ్‌ఖాన్
- మార్కెట్ యార్డులో మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం


మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు కాటసాని, హఫీజ్‌ఖాన్

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల సంక్షేమం లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. మార్కెట్ కమిటీ పాలక వర్గం తీసుకుంటున్న చర్యలతో మార్కెట్ కమిటీ అభివృద్ధి పథంలో నడుస్తుందని, మార్కెట్ కమిటీకి ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని స్పష్టం చేశారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ శమంతకమణి స్వంత ఖర్చులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆమెతో కలిసి ఎమ్మెల్యేలు ప్రారంభించారు. కార్యక్రమంలో శమంతకమణి కుటుంబసభ్యులు కూడా పాల్గొన్నారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే మార్కెట్ యార్డులో మూడు చలి వేంద్రాలను కూడా ప్రారంభించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి చాంబరులో 2024-25 సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. 2023-24లో మార్కెట్ కమిటీకి గణనీయంగా ఆదాయం పెరిగినందుకు ఎమ్మెల్యే కాటసాని హర్షం వ్యక్తం చేశారు. 2022-23లో ఏప్రిల్ నుంచి జనవరి వరకు రూ.4కోట్లు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. 2023-24లో ఏప్రిల్ నుంచి జనవరి వరకు 5.40 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. 2024-25లో రూ. 6.70 కోట్ల ఆదాయం సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపుతున్నామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... మార్కెట్ యార్డు అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు, వైస్ చైర్మన్ బీమేశ్వరరెడ్డి, ఇతర పాలకవర్గం సభ్యులు, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# 22 నుంచి కేవీఆర్‌లో అంతర్జాతీయ సదస్సు


అంతర్జాతీయ సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న క్లస్టర్ వర్సిటీ వీసీ సాయిగోపాల్ తదితరులు

కర్నూలు కల్చరల్ : క్లస్టర్ యూనివర్సిటీ కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 22, 23 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'పాలస్తీనా-ఇజ్రాయేల్ దేశాల్లో ఎడతెగని సమస్యలు-వాటి ప్రభావం-ప్రపంచ దేశాల పాత్ర' అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి విద్యావేత్తలు హాజరవుతున్నట్లు వీసీ తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.సి.సాహిత్య, అధ్యాపకులు దండబోయిన పార్వతి దేవి, ఇర్ఫానా, రాధారాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు


హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీఎండబ్ల్యూఓ సునీల్‌కన్నా

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణకు సంబంధించి వసతి గృహ సంక్షేమాధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డా.ఏ సునీల్‌కన్నా హెచ్చరించారు. సోమవారం ఉదయం ఆయన స్థానిక గణేష్‌నగర్‌లోని మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన హాస్టల్‌కు వెళ్లిన సమయంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే విద్యార్థులు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని, వెంటనే పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. అలాగే నిర్దేశిత సమయంలోగా విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు కూడా వ్యక్తిగత శుభ్రత పాటించాలని, సమయానికి కళాశాలలకు వెళ్లి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

# దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

కర్నూలు(సెంట్రల్): బీజేపీ కబంధ హస్తాల నుంచి దేశాన్ని కాపాడుకోవడానికి ఈ నెల 16వ తేదీన చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. సోమవారం పాతబస్టాండ్‌లోని సుర్జీత్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోయిందన్నారు. రైతులు, కార్మికుల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్లను జైళ్లకు పంపే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. రైతు చట్టాల ఉపసంహరణ సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ దేశాయ్, రాజశేఖర్, మార్రేళ్ల విజయ రామాంజనేయులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి**

కర్నూలు(సెంట్రల్) : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, స్టేజీ కన్వర్షన్లలో పురోగతి లేకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను హెచ్చరించారు. సోమవారం ఆమె క్యాంపు కార్యాలయం నుంచి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్, తహసీల్దార్లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

**ఆరోపణలు సరికాదు**

కల్లూరు: పాణ్యం ఎమ్మెల్యే కాటసానిపై కల్లూరు అర్బన్ 30వ వార్డు కార్పొరేటర్ జయరాముడు, తండ్రి సంజన్న అసత్య ఆరోపణలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా ఈసీ మెంబర్ హేమలత, నాయకులు హరిప్రసన్న, రాజేష్, చంద్రశేఖర్, రత్నమయ్య మండిపడ్డారు. సోమవారం వారు కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ మారాలనుకుంటే వెళ్లిపోవాలే తప్ప నిందలు వేయడం తగదన్నారు. కార్పొరేటర్ జయరాముడు, సంజన్నలపై కేసులు పెట్టించాల్సిన అవసరం ఎమ్మెల్యేకు లేదన్నారు. వార్డులో సీనియర్లను కాదని మీకు కార్పొరేటర్‌గా అవకాశం కల్పించి ప్రోత్సహించిన విషయాన్ని మరచిపోరాదన్నారు.

**జీవో విడుదల చేయాలి**

కర్నూలు (టౌన్) : మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలపై తక్షణం జీవో విడుదల చేయాలని ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి కోరారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం, సరెండర్ లీవ్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దేవసహాయం, సవారి, షాలు, రాధమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

**ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే ఇవ్వాలి**

కల్లూరు: 2023 ఖరీఫ్ సీజన్‌లో కరువుతో నష్టపోయిన పంటలకు వెంటనే కరువు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమ వారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులో జిల్లాలోని 25 మండలాల్లో 22 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

## క్రైం కార్నర్

**మందు బాబులకు జైలు శిక్ష**

కర్నూలు : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మంది మందుబాబులకు ఒక్కొక్కరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నగర శివారులోని సుంకేసుల రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. తెలంగాణలో మద్యం తాగి వాహనాలపై కర్నూలుకు వస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకుని డ్రంకెన్ డ్రైవ్ టెస్టు నిర్వహించగా 12 మంది మోతాదుకు మించి మద్యం సేవించినట్లు బయటపడింది. వారిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రెండు రోజులు జైలు శిక్షతో పాటు నలుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. దీంతో వారిని పంచలింగాల శివారులోని జిల్లా జైలులో అప్పగించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# క్రీడాకారులకు సంపూర్ణ సహకారం

- బాస్కెట్ బాల్ అంతర్ పాఠశాలల పోటీల్లో శాప్ చైర్మన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్) : రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడల్లో రాణించే క్రీడాకారులకు తమ వంతుగా సంపూర్ణ సహకారం అందిస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో బాస్కెట్ బాల్ అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. శాప్ చైర్మన్‌గా జిల్లాలో క్రీడారంగం అభివృద్ధికి కృషి చేశానని, కర్నూలులో బాస్కెట్‌బాల్ సింథటిక్ కోర్టు, ఆళ్లగడ్డ, బేతంచెర్ల, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ఇండోర్ స్టేడియాల నిర్మాణానికి చర్యలు చేపట్టానన్నారు. ప్రతి విద్యార్థి, విద్యార్థినీ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. బాలికల విభాగంలో 16 జట్లు, బాలుర విభాగంలో 16 జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి భానుప్రకాష్ వెల్లడించారు. కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ షేక్ అహమ్మద్, సీఈఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

# హాకీ చాంపియన్ వైఎస్ఆర్ జిల్లా బాలుర జట్టు

- నాలుగో స్థానంలో కర్నూలు జట్టు
- ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ చాంపియన్‌షిప్ పోటీలు


కర్నూలు జట్టుకు మెమోంటో అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ బాలుర చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఫైనల్లో వైఎస్ఆర్ జిల్లా జట్టు 2-1 గోల్స్ చేసి అనకాపల్లి జట్టుపై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. రన్నర్ స్థానంలో అనకాపల్లి జట్టు, మూడో స్థానంలో పశ్చిమ గోదావరి జట్టు, నాలుగో స్థానంలో కర్నూలు జట్టు నిలిచింది. విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమానికి గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అతిథులుగా హాజరై ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్నూలులో హాకీ పోటీలు విజయవంతంగా ముగియడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, నిర్వహణ కార్యదర్శి ప్రవీణ్, హాకీ సంఘం ఆంధ్ర ప్రతినిధి థామస్ పీటర్, ఎక్సైజ్ శాఖ మేనేజర్ విశ్వమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### భక్తి శ్రద్ధలతో రుద్ర హోమం

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 18వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకం, రుద్ర, దృష్టి దుర్గా హోమాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. స్వామివారిని చంద్ర ప్రభ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించగా భక్తులు దర్శించుకొని తరించారు. మహిళలు జ్యోతి ఉత్సవం నిర్వహించారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్‌కే రాజశేఖర్ రావు, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి హెచ్‌కే మనోహర రావు, కమిటీ సభ్యులు ఉమేష్, రాజేష్ శర్మ, విజయభాస్కర్, శ్రీనాథ్, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

### 29న ఆదోనిలో మహాగర్జన

కర్నూలు (అర్బన్) : ముస్లిం మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 29వ తేదీన ఆదోనిలో మహాగర్జన నిర్వహిస్తున్నట్లు ముస్లిం మైనార్టీ హక్కుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ మహబూబ్ బాషా తెలిపారు. ఈనెల 11న కర్నూలులో నిర్వహించిన గర్జన విజయవంతమైందని చెప్పారు. సోమవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్‌బోర్డు స్థలాలు అన్యాక్రాంతమయ్యాయని చెప్పారు. మండల స్థాయిలో ఫోరం కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ తహసీల్దార్ రోషన్ అలీ, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా, నాయకులు సోయాబుద్దిన్ ఖాద్రి, ఎంఎండీ బాషా, సయ్యద్ ముర్తుజా షా ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.



# వాల్మీకుల హామీని విస్మరించిన ప్రధాని

- ఎస్టీ రిజర్వేషన్ అంశంపై వైఎస్సార్‌సీపీ ఎంపీలు మాట్లాడటం హర్షణీయం
- వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం సుభాష్ చంద్రబోస్
- గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు వాల్మీకులకు ఇబ్బందులకు గురిచేశారని వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకులకు ఇచ్చిన హామీని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విస్మరించారని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్ చంద్రబోస్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడచిన సార్వత్రిక ఎన్నికలకు ముందు కర్నూలులో జరిగిన బహిరంగ సభలో మళ్లీ తాము అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌లోని వాల్మీకి/ బోయలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టబద్ధం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో 2007 నుంచి చేస్తున్న నిరంతర పోరాటాల ఫలితంగానే రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాల్మీకి/బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేసిందన్నారు. దీనిని పార్లమెంట్‌లో ఆమోదించాలనే డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వంపై వివిధ రూపాల్లో ఉద్యమాలు కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటికే ఆరు పర్యాయాలు వందలాది మంది వాల్మీకులతో కలిసి ఢిల్లీకి వెళ్లి జంతర్‌మంతర్ వద్ద దీక్షలు, ధర్నాలు చేపట్టామన్నారు. ఎస్టీ రిజర్వేషన్ సాధించడమే వీఆర్‌పీఎస్ ఏకైక లక్ష్యమన్నారు. అవసరమైతే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తామన్నారు. వాల్మీకుల పక్షాన పార్టీలకు అతీతంగా పోరాడుతున్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తమపై అనేక తప్పుడు కేసులు బనాయించారని, పలు సందర్భాల్లో భౌతికంగా చిత్ర హింసలకు గురి చేసి జైళ్లలో పెట్టించారన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక్క ఎంపీ కూడా వాల్మీకుల ఎస్టీ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. అదే వైఎస్సార్‌సీపీ ఎంపీలు పలు మార్లు వాల్మీకుల అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాల్మీకుల అంశాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలని, లేని పక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో నేతలు కప్పట్రాళ్ల మల్లికార్జున మాలపల్లి లక్ష్మయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.